క్లుప్తంగా

సీసీ కెమరాల ఏర్పాటు



సీసీ కెమరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు

దెంకాడ: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో పలు సీసీ కెమరాలను పోలీసులు శనివారం ఏర్పాటు చేశారు. విజయనగరం–నాతవలస ఆర్అండ్‌బీ రహదారి ఆనుకుని ఉన్న బజారు జంక్షన్ వద్ద రోడ్డుకు ఇరువైపులా దృశ్యాలను నిక్షిప్తం(రికార్డు) చేసేలా కెమరాలను అమర్చామని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. నేరాల విచారణలో కీలకంగా మారుతున్న ఈ కెమరాల ద్వారా నిందితులను పట్టుకోవడం సులభతరమవుతుందని, భోగాపురం సీఐ రామకృష్ణ ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారురాజు

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న పైడితల్లి ఆలయ నిర్మాణానికి ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు తనవంతు సాయంగా రూ.3 లక్షల విరాళం అందజేశారు. ఆయన పోలిపిల్లి గ్రామంలోని తన స్వగృహంలో ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బుగత రామ్మోహన్, ఓదూరి నరసింహులు, బోణి లక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కాలువ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఈ కనకారావు, ఏఈలు

పూసపాటిరేగ: రామతీర్థసాగర్ రిజర్వాయర్ కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ప్రాజెక్ట్ డీఈ పి.కనకారావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని చల్లవానితోట రెవెన్యూ పరిధిలో నిర్మాణం జరుగుతున్న ప్రదేశాన్ని ఆయన శనివారం పరిశీలించి, కాసేపు మాట్లాడారు. కాలువ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని, మరికొన్ని చోట్ల కాలువల నిర్మాణానికి భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ఆయన వెంట ఏఈలు జి.నివేదిత, బి.సౌజన్య, బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

వీధి దీపాలను బాగుచేయండి



పాడైన వీధి దీపాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలోని పాత ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ పైఅంతస్తులోని ఓ గదిలో భద్రపరిచిన పాడైన వీధి దీపాలు(విద్యుత్ బల్బులు)ను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తక్షణమే వాటిని బాగుచేసి, అవసరమైన చోట ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నగర వీధుల్లో ఎక్కడా వీధి దీపాల సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అర్బన్ రీసర్వే ప్రక్రియను పరిశీలించి, త్వరితగతిన ప్రక్రియను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

మద్యంసీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు

దెంకాడ: మండల పరిధిలోని గుణుపూరుపేట వద్ద అక్రమంగా తరలిస్తున్న 192 మద్యంసీసాలను పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. స్పెషల్ బ్రాంచి పోలీసులు అందించిన ముందస్తు సమాచారం మేరకు ఆ చోటుకు ముందుగా చేరుకుని, కారులో తనిఖీలు చేపట్టారు. మద్యంసీసాలు పట్టుకుని, కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించామన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంచాయతీల అభివృద్ధికి.. ప్రణాళికలే కీలకం

- జీపీడీపీ తయారీపై శిక్షణలో ప్రజా ప్రతినిధులు, అధికారులు

దెంకాడ: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలే కీలకమని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, జీపీడీపీ(గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు)తయారీపై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన.. శిక్షణార్థులకు పలు సూచనలు చేశారు. పంచాయతీల స్వయంసమృద్ధి సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి, వాటిని అమలు చేయాలన్నారు. ప్రణాళికల తయారీ విధానాలను ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, ఇతర అధికారులు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డీఈ వైకుంఠంనాయుడు, అబ్జర్వర్ మహ్మద్ రఫీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: ముందస్తు ప్రణాళికలతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు జీపీడీపీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇదే కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని, పలు సూచనలు చేశారు. గ్రామాల అభివృద్ధి నిమిత్తం మంజూరయ్యే 15వ ఆర్థికసంఘం, ఎన్ఆర్ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిశోర్‌కుమార్, ఈవోపీఆర్‌డీ గాయత్రి, ఏవో కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దెంకాడ: మాట్లాడుతున్న ఎంపీపీ వాసుదేవరావు



భోగాపురం: మాట్లాడుతున్న ఎంపీపీ అనూషరెడ్డి



పూసపాటిరేగ: సూచనలిస్తున్న తహసీల్దారు గోవింద

అధికారుల నిర్లక్ష్యం..

పూసపాటిరేగ: పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని తహసీల్దారు తాడ్డి గోవింద కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీవోఏలకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై ఇస్తున్న శిక్షణకు ఆయన హాజరై, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీల అభివృద్ధి కోసం విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీలకు వచ్చే ఆర్థికసంఘం నిధులు సహా జనరల్ ఫండ్ నిధులతో గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఏయే పనులకు ఎంతమేర నిధులు ఖర్చు చేస్తున్నారో రికార్డు నిర్వహించాలన్నారు. పంచాయతీలను అభివృద్ధి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, చేసిన పనులకు సకాలంలో బిల్లులు మంజూరు చేయడం లేదని రెల్లివలస, వెంపడాం సర్పంచ్‌లు ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధిక, ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, రిసోర్స్‌పర్సన్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల బహిష్కరణ..

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఇస్తున్న శిక్షణకు ఎంపీపీ అంబళ్ల సుధారాణి హాజరై, శిక్షణార్థులను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. 2025–26 ఆర్థికసంవత్సరానికి సంబంధించి, మంజూరవుతున్న నిధులను గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు సక్రమంగా వినియోగించాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శంకర్ జగన్నాథ్, ఏవో సుదర్శనం తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఉపాధి హామీ పథకం అభివృద్ధి పనులను వెండర్లకు కాకుండా తమకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు శిక్షణ కార్యక్రమాన్ని బహిష్కరించారు. శిక్షణా తరగతుల నుంచి వాకౌట్ చేసి, నినాదాలు చేశారు. తమకు న్యాయం చేయకపోతే ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరిస్తామన్నారు.

నిషేధిత పాలిథిన్ ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు



స్వాధీనం చేసుకున్న నిషేధిత పాలిథిన్ సామగ్రితో అధికారులు

విజయనగరం: నిషేధిత పాలిథిన్ ఉత్పత్తులు(సంచులు, గ్లాసులు, చెంబాలు) విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ఎనిమిదో సర్కిల్ నందు 27, 30వ సచివాలయాల పరిధిలో ఉన్న హోల్‌సేల్ దుకాణాల్లో సిబ్బంది శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దాదాపు 500 కిలోల పైబడి నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి నేతృత్వంలో బృందాలుగా ఏర్పడి మరీ సిబ్బంది ఏకకాలంలో షాపుల్లో తనిఖీలు చేపట్టారు. మరోసారి పట్టుబడితే దుకాణాలు సీజ్ చేస్తామని కమిషనర్ అన్నారు. ప్రజలు కూడా నిషేధిత ప్లాస్టిక్, పాలిథిన్ సంచులను వినియోగించవద్దని సూచించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, రవిశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రైతులకు సూచనలిస్తున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలస గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ సేతుమాధవన్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన రైతులనుద్దేశించి, కాసేపు మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు ఇచ్చి, మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మకాలు చేయాలని తెలిపారు. ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అవుతుందన్నారు. ఈ ఏడాదికి సంబంధించి, జిల్లాలో 3.20 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సాధారణ రకం ధాన్యం క్వింటాకు మద్దతుధర రూ.2,300 ఇచ్చి, కొనుగోలు చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఏ మీనాకుమారి, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, జిల్లా సహకార అధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించండి



ఉడా కాలనీ పార్కులోని క్రీడాకారులతో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగర పరిధిలోని కేఎల్‌పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. అక్కడి పరిసరాలను పరిశీలించిన ఆయన.. కేంద్రానికి వెళ్లేందుకు సరైన రోడ్డు, ప్రహరీ లేకపోవడం వంటి వాటిని గమనించారు. ఆస్పత్రికి కావాల్సిన మౌలిక వసతులకు సంబంధించిన అంచనాలను రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అక్కడి నుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన..ఆయా ప్రాంతాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. కొత్తగా నిర్మించిన సీసీ కాలువపై కొంతమంది ఇళ్ల యజమానులు ర్యాంపులు వేసుకుని, పూర్తిగా కాలువ కప్పివేయడాన్ని చూసి, సంబంధిత ఇళ్ల యజమానులపై మండిపడ్డారు. ర్యాంపులు తొలగించాలని లేకపోతే సిబ్బంది వచ్చి తొలగిస్తారని హెచ్చరించారు. అక్కడి నుంచి ఉడా కాలనీలోని పార్కుకు వెళ్లి, పార్కు సంరక్షణ బాధ్యత స్థానికులే చేపట్టడం మంచిదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి టిఫిన్ దుకాణాల వద్దకు వెళ్లి, నిషేధిత పాలిథిన్ సంచులు వినియోగిస్తున్న వారిని మందలిస్తూ అపరాధ రుసుం విధించారు.

సీతం కళాశాలలో క్యాంపస్ డ్రైవ్



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో అలేఖన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎంబీఏ, బీబీఏ విద్యార్థులకు శనివారం పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. ఈ డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకున్నారు. వీరిలో గ్రూప్ డిస్కషన్స్‌లో ప్రతిభ చూపిన 40 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి తెలిపారు. ఎంపిక కార్యక్రమాన్ని అలేఖన్ సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ పి.వినీల, హెచ్ఆర్ మేనేజర్ ఎస్.లక్ష్మీరేణుక నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు అభినందించారు.

శతశాతం 'అపార్' నమోదు చేపట్టాలి

విజయనగరం: అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు ప్రక్రియను శతశతం పూర్తి చేయాలని నగర కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందిని ఆదేశించారు. ఇదే విషయమై నగర పరిధిలో పలుచోట్ల జరుగుతున్న అపార్ నమోదు ప్రక్రియను ఆయన శనివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. అపార్ నమోదుకు అవసరమైన ఆధార్‌లోని వివరాల్లో ఏవైనా తప్పులుంటే వెంటనే వాటిని సరిచేయాలన్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాల జారీలో జాప్యం చేయొద్దని తెలిపారు.

లక్షదీపోత్సవం రేపు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆవరణలో ఈనెల 18న లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు శివ భక్త మండలి ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం, 5 గంటలకు కార్తీకమాసం విశిష్టతపై ప్రవచనాలు, 6.30 గంటలకు లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు.

పత్రికలు సమాజాభివృద్ధికి దిక్సూచీలు

- సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎస్ రాజు



సీనియర్ పాత్రికేయులను సత్కరిస్తున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ రాజు

విజయనగరం అర్బన్: పత్రికలు సమాజాభివృద్ధికి దిక్సూచీలని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్నాయని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన జాతీయ పత్రికా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. పాత్రికేయులది సమాజంలో ఎప్పుడూ బాధ్యతాయుతమైన కీలక పాత్రేనన్నారు. గ్రంథాలయ వ్యవస్థ బలోపేతానికి గ్రంథాలయ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పుస్తక పఠనం, నిరంతర సాధన వల్ల అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని విద్యార్థులకు సూచించారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు ఎలిశెట్టి సురేష్‌కుమార్, ఎం.విజయ భాస్కర్, పంతులు, ఎస్.సన్యాసిరాజు, కంది గౌరీశంకర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొత్తలి ఎర్నాయుడు, సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు కె.దయానంద్, గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ఏర్పాటుకు మహనీయుల కృషి



గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేసిన వారి సేవలను కొనియాడుతున్న లైబ్రేరియన్ మహేష్

దెంకాడ: గ్రంథాలయాల ఏర్పాటుకు ఎంతో మంది మహనీయులు కృషి చేశారని లైబ్రేరియన్ వై.మహేష్ కొనియాడారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాల స్థాపనకు పాటుపడిన పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, వావిలాల గోపాలకృష్ణయ్యల ఫొటోలు ప్రదర్శిస్తూ వారి సేవలను శనివారం కొనియాడారు. వారి కృషి ఫలితంగా ఏర్పాటైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని, ఎంతోమంది ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



పూసపాటిరేగలోని జగన్నాథరాజు ఫంక్షన్ హాల్‌లో శనివారం చేపట్టిన షిర్డీసాయి బాబా నాటక ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. సాయిబాబా భక్తుడు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వక్త బొడ్డు విజయరామయ్య పర్యవేక్షణలో బాబా జీవితచరిత్ర సహా ఆయన చేసిన అద్భుత మహిమలను కళాకారులు కళ్లకు కట్టినట్లు చూపించారు. భక్తిభావంతో ఎంతపెద్ద లక్ష్యాన్ని అయినా చాలా సులభంగా చేరుకోవచ్చనే సందేశమిస్తూ నాటకం సాగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

–పూసపాటిరేగ

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



తమ సమస్యలు పరిష్కరించాలని 104 వాహన ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దుమ్ము జగన్మోహనరావు, సిబ్బందితో కలిసి నెల్లిమర్ల మండలంలోని దన్నానపేటలో సర్పంచ్ గేదెల రామచిరంజీవికి శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 104 వాహనాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా ప్రభుత్వమే నిర్వహించాలని, సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించాలని, 2020లో విధుల్లో చేరిన వారందరికీ జీవో నంబర్ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్మును తిరిగి ఉద్యోగులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

–నెల్లిమర్ల

పుస్తకావిష్కరణ



విజయనగరం జిల్లా గ్రంథాలయంలో కవి శ్రీరంగం నారాయణబాబు రాసిన రుధిర జ్యోతి అనే పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. సాహితీవేత్త, చరిత్ర పరిశోధకుడు గార రంగనాథం మాట్లాడుతూ శ్రీశ్రీకి వరసకు సోదరుడు అయినప్పటికీ ఎటువంటి భేషజాలకు పోకుండా సాధారణ జీవితం గడిపి, పేరుప్రఖ్యాతలు ఆశించని గొప్పకవి నారాయణబాబు అని ప్రశంసించారు. బెంగాలీ చలనచిత్ర రంగంలో పనిచేసినా, తమిళనాడులోని ఎంజీఆర్‌తో సన్నిహిత సంబంధాలున్నా ఏనాడు ఆయన గొప్పలకు పోలేదన్నారు. ఆయన లాంటి వ్యక్తి మన విజయనగరంలో పుట్టడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో నాలుగెస్సుల రాజు, ఎస్.కె.బాబు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం టౌన్

మండుటెండలో భక్తుల నిరీక్షణ



నెల్లిమర్లలోని పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన సత్రం వద్ద అన్నప్రసాదం కోసం భక్తులు గంటల తరబడి మండుటెండలో నిరీక్షించిన దృశ్యాలు శనివారం కనిపించాయి. దైవదర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇక్కడ భోజనం పెట్టేందుకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే అన్నం కోసం నిల్చొనే చోట సరైన షెడ్డు, కనీసం టార్పాలిన్ కూడా ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. చిన్నారులు, వృద్ధులతో చాలాసేపు ఎండలోనే నిల్చోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

–నెల్లిమర్ల రూరల్

సైనిక్ స్కూల్‌ను సందర్శించిన జేసీ



పాఠశాల సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌ను జేసీ ఎస్.సేతుమాధవన్ శనివారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు సహా అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, వసతులు కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో మెలగి బాగా చదువుకోవాలని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటరమణ, తదితరులు ఉన్నారు.